


# శ్రమయేవ జయతే..?

ద్విభాష్యం రాజేశ్వరరావు

అనగనగా ఓ కోడిపుంజు వుండేది!

ఒకనాడు పెంటకుప్పమీద ఆహారం కోసం కెలుకుతూ ఉంటే బోలెడు ధాన్యం గింజలు దాని కంటబడ్డాయి. వాటిని ఆనందంతో మూట కట్టింది. కాని, అంతలోనే దానికి ఒక మంచి ఆలోచన కలిగింది. ధాన్యపు గింజల్ని తినేసేబదులు, వాటిని పొలంలో జల్లి పండిస్తే బోలెడంత దిగుబడి వస్తుంది అనుకుంది. దానికి 'శ్రమయేవజయతే' అనే నినాదం మీద బోలెడంత నమ్మకం వుంది!

అయితే, గింజలు చల్లటం, పంట కోతకు వచ్చేక కోయటం, నూర్చటం ఇవన్నీ తన ఒక్కదానివల్లా అయ్యే పనులుకావు! అందుకని పొరుగున వున్న మిత్రుల సహాయం అడుగుదామని వెళ్లింది కోడిపుంజు!!

మొట్టమొదట అది నక్కబావ ఇంటికి వెళ్ళింది!

నక్కబావ ఆ వూళ్ళో ఆర్.టి.వో. ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తోంది. గుమాస్తా గిరీ వెలగబెడుతూనే ఆ వూళ్లో మూడు ప్లాటులు, నాలుగు బిల్డింగులు కొనటమే కాకుండా ఓ అర్డజను టేక్సీలు కూడా భార్య పేరుమీద తిప్పుతోంది! మూడు లైసెన్సులు, ఆరు టోకెన్లు కింద బతుకుతోంది నక్కబావ!

కోడిపుంజును చూడగానే నక్క సాదరంగాఆహ్వానించింది!

"నాకో సహాయం చేయాలి బావా!" అంది కోడిపుంజు.

నక్క 'హిహిహి' అని నవ్వింది.

తర్వాత తన ముందున్న టేబిలు కిందనుండి చేయిచాపింది! చేయి చాపిన తర్వాత ఆపకుండా నవ్వు కంటిన్యూ చేస్తూనేవుంది! కోడిపుంజుకి ఏమీ అర్థం కాలేదు!! అందుకే అర్థంకానట్టు నక్క వంక చూసింది!

"సహాయం కావాలి కదా! లంచం పడెయ్!" అంది అతి మామూలు ధోరణిలో. కోడిపుంజుకు ఒళ్ళు మండిపోయింది.

అయినా, కోపాన్ని అణుచుకుంటూ "నా దగ్గర ధాన్యం గింజలు వున్నాయి. వాటిని తినెయ్యకుండా, పొలంలో చల్లి పంట పండిద్దామనుకుంటున్నాను. పంట పండితే దిగుబడి ధాన్యం మనిద్దరం కలిసి హాయిగా తినొచ్చు. అందుకని నాకు వ్యవసాయంలో సహాయం చేస్తావని వచ్చాను" అంది.

"నీకు వ్యవసాయంలో నేను సహాయం చేయాలా? చాల్లే ఎవరయినా వింటే నవ్వుపోతారు! బంగారు గనిలాంటి నా ఉద్యోగానికి సెలవు పెట్టుకుని బోడి వ్యవసాయానికి సాయం రమ్మంటున్నావా? వెళ్ళు వెళ్ళు!" అంటూ కసిరేసింది.

కోడిపుంజు చేసేదిలేక అక్కడినుండి బయలుదేరి గాడిద మావ ఇంటికి వెళ్లింది. గాడిద "పోస్టు అండ్ టెలిగ్రాఫ్స్ డిపార్టుమెంటు" లో ఇరవై ఏళ్ళుగా పని చేస్తోంది. ఇంతవరకూ ప్రమోషను రాలేదు గాడిదకు! ఇంకో పదిహేను సంవత్సరాలవరకు వచ్చే ఆశ కూడా లేదు! అయినా "గాడిద చాకిరీ" చేస్తోంది గాడిద. కోడిపుంజు తాను వచ్చిన సంగతి వివరించగానే దీనంగా ముఖం పెట్టింది గాడిద.

"నా పనితోనే నాకు తీరిక లేదు నీకెలా సహాయం చేయగలను?" అంటూ ముఖం తిప్పేసుకుంది.

గాడిద ప్రక్కనే టేబిల్ మీదవున్న "టూఇన్‌వన్" "నేషనల్ పేనాసోనిక్" సెట్ చూడగానే కోడిపుంజుకు మతిపోయింది. తళ తళా నిగ నిగా అందంగా మెరిసిపోతోంది అది!

"అబ్బ రికార్డరు ఎంత బాగుందో? కొన్నావా గాడిద మామా?" అంది.

"అబ్బే కొనలేదు. దుబాయ్‌నుండి వచ్చింది" అంది గాడిద

ఆ సంభాషణ పొడిగించటం వరి ఇష్టం లేనట్టు ముఖం పెట్టి.

'మామా; మీ పిల్లలు దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నారా?"

"అబ్బే అలాటిదేం లేదు. దుబాయ్‌లో పనిచేస్తున్న వాళ్ళు ఈ దేశంలో వాళ్ళ నాన్నలకి అమ్మలకీ, భార్యలకీ, పిల్లలకీ ఇలాటి బహుమతులు పార్సిల్సు కట్టి పంపిస్తూ వుంటారు. పార్సిలు సరిగా కట్టరు. ఇలాటివి జారిపోయి, ఆఫీసులో పడిపోతూ వుంటాయి. మేం తీసి జాగ్రత్త పెట్టి వాళ్ళకి అప్పగిస్తూ ఉంటాం" అంది గాభరగా.

కోడిపుంజుకు గాడిద ఎందుకు గాభరా పడుతుందో అర్థమయింది. అక్కడనుంచి బయలుదేరి తిన్నగా పంది దగ్గరకు వెళ్లింది. పంది ఓ ప్రయివేటు కంపెనీలో ఆఫీసు అసిస్టెంటుగా పనిచేస్తోంది! అందంగా బలిసి చూడటానికి ముద్దుగా బొద్దుగా వుంటుంది!

కోడిపుంజు తాను వచ్చిన కారణం వివరించింది!

"తప్పకుండా సహాయం చేస్తాను!" అంది పంది.

కోడిపుంజు సంతోషించింది!

"ఓవరుటైము మాత్రం నిమిషాలతోసహా లెక్కకట్టి ఇవ్వాలి! అందుకు సిద్ధమేనా?" అంది మళ్లీ!

కోడిపుంజు సంతోషమంతా కరిగిపోయింది.

"నా దగ్గిర డబ్బులేదు! పంట పండేక పంచుకుందాం!" అంది.

"అది ఎలాగూ తప్పదు! ముందు ఓవరు టైము సంగతి చూడు!" చేసేదిలేక పందిదగ్గిర శెలవుతీసుకుని తిన్నగా బాతు ఇంటికి వెళ్ళింది కోడిపుంజు!

బాతు సచివాలయంలో పనిచేస్తోంది!!

కోడిపుంజును చూడగానే ఆదరంతో ఆహ్వానించి కాఫీ ఇచ్చింది బాతు. కాఫీ తాగేశాక మెల్లగా తాను వచ్చిన పని బయట పెట్టింది కోడిపుంజు.

"మిత్రమా! మనిద్దరం కలిసి పనిచేద్దాం! ఫలితం పంచుకుందాం!" బాతు తాపీగా కోడిపుంజుమాటలను వింది. తర్వాత అంతకంటె తాపీగా అడిగింది ' పనిచేయటమంటే ఏమిటి?"

కోడిపుంజు ఈ ప్రశ్నకు విస్తుపోయింది!!

"అదేమిటి? పనిచేయటమంటే తెలీదా? మరిమీరు ఆఫీసులో ఏం చేస్తారు?" అంది.

"సమ్మెలు!" అంది బాతు మరింత తాపీగా.

కోడి పుంజుకు ఏం మాట్లాడాలో తోచలేదు! తర్వాతఅంది.

"సమ్మెలో లేనపుడు పనిచేస్తారుకదా!"

''పనిచేసే ప్రభుత్వం వెళ్ళిపోయింది! ఫిరాయింపుల ప్రభుత్వం వచ్చేసింది. అందువల్ల ఆ సంగతి మాట్లాడకు. కావాలంటే సమ్మె ప్రారంభించు. నా మద్దతు నీకు సంపూర్తిగా వుంటుంది.

బాతువల్ల ఏ సహాయమూ అందేలా కనబడలేదు కోడిపుంజుకు. ఆఖరి ప్రయత్నం చేద్దామని గొర్రెపోతు వద్దకు వెళ్లింది. గొర్రెపోతు' అతి పెద్దవాళ్ళను సైతం అతి నిర్లక్ష్యంగా చూసే ఒక అతి పెద్ద బేంకు'లో గుమాస్తాగా పనిచేస్తోంది! కోడి పుంజును చూడగానే గొర్రెనవ్వు నవ్వింది గొర్రెపోతు!

తన మనసులోని మాటను బయటపెట్టింది కోడిపుంజు!

అంతా విన్న గొర్రెపోతు "నాకు పనిగండం! కౌంటరు వుంటేనే పనిచేయను నేను! అలాటిది బయటకువచ్చి వ్యవసాయంలో సహాయం అందించమంటే నావల్ల అవుతుందా? నాకు పని చెప్పకు! అంది.

కోడిపుంజు నిరాశగా బయటకు వెళ్ళిపోతూ వుంటే "శ్రమ యేవ జయితే!" అంటూ గట్టిగా అరిచింది గొర్రెపోతు.

కోడి పుంజుకు ఒళ్ళు మండిపోయింది.

"పనిచేయవుగాని, ఆ నినాదాలన్నీ ఎందుకు?" అంది కోపంగా.

"పరాయివాళ్ళ శ్రమయేవ, మనకు జయతే అని దాని అర్థం నాయనా!" అంది నవ్వుతూ.

కోడిపుంజు విసవిసా వెళ్లిపోయింది అక్కడ నుండి!

ఎక్కడ నుండీ దానికి సహాయం అందేమార్గం కనబడలేదు!

అయినా నిరాశ చెందకుండా కష్టపడి బంజరు భూమిని తానే దున్నింది! గింజలు చల్లింది! కొద్దికాలంలోనే మొక్కల్ని ఊడ్చింది. తర్వాత పైరు ఏపుగా పెరిగింది!

దారిన వెళ్తున్న ఒక పెద్ద మనిషి పైరునుచూసి "మంచి ఎరువు వాడు! దిగుబడి బాగుంటుంది!" అంటూ సలహా యిచ్చేడు. కాని ఎరువులు కొనాలంటే డబ్బు కావాలి! అప్పు ఎవరు ఇస్తారు?

ఆ మాటే అడిగింది పెద్ద మనిషిని!

"నేనిస్తాను! నీలాటి దళిత వర్గాలకు సహాయం చేయటానికే నేను ఉన్నాను. తర్వాత బాకీ తీరుద్దువుగానిలే!" అంటూ ఎరువులు కొనటానికి జేబులోంచి డబ్బుతీసి ఇచ్చేడు.

ఎంతో ఆనందంగా డబ్బు అందుకుని ఎరువులుకొని పైరుకు వాడింది కోడిపుంజు.

కొద్ది కాలంలోనే పైరు కోతకు వచ్చింది!

పంటను చూడగానే కనువిందయింది కోడిపుంజుకు!

కనీసం కోతల సమయంలోనైనా సహాయం అందిస్తారేమోనని మళ్ళి మిత్రులందరి దగ్గరకూ వెళ్ళింది కోడి పుంజు! ఫలితం మామూలే.

అయినా, నిరుత్సాహం చెందకుండా, తానే స్వయంగా పంటను కోసి, పనలు ఆరబెట్టి, తర్వాత మార్పుచేసి గింజల్ని బస్తాలకెత్తింది కోడిపుంజు. ఎదురుగా ఎనిమిది బస్తాల ధాన్యం.

కోడిపుంజు మనసు తృప్తితో, ఆనందంతో నిండిపోయింది.

"శ్రమ యేవ జయతే!" అంటూ గట్టిగా అరిచింది కోడి పుంజు.

తను అరవటం ఆపేసినా తనవెనక ఇంకా ఏవో అరుపులు, గోల జరుగుతున్నట్లు అనిపించి వెనక్కు తిరిగింది.

నక్క, గాడిద, పంది, బాతు, గొర్రెపోతు ఇవన్నీ తన వెనుక నిలబడి గట్టిగా నినాదాలు చేస్తున్నాయి.

"పెట్టుబడిదారీ విధానం నశించాలి."

"పంటను అందరూ సమానంగా పంచుకోవాలి."

"దేవుడిచ్చిన భూమి ఎవడబ్బ సొమ్ము కాదు!"

అంటూ రకరకాల నినాదాలు అట్టలకు రాసి కర్రలకు తగిలించి పట్టుకున్నాయి.

"దౌర్జన్యం నశించాలి! పండిన బియ్యం అందరూ సమానంగా పంచుకోవాలి!" అంటూ గట్టిగా నినాదాలు చేశాయి.

కోడిపుంజు అరికాలి కోసం పింఛాని కెక్కింది.

"ఇదంతా నేను కష్టపడి పండించుకున్నాను. ఎవ్వరికీ గింజ కూడా ఇవ్వను!" అంది కోపంగా.

దానితో అవన్నీ కోడిపుంజుతో ఘర్షణకు దిగాయి. దారంట పోతున్న ఒకాయన అటు వచ్చి "ఏం జరిగింది?" అంటూ అడిగాడు.

కోడిపుంజు కళ్ళనీళ్ళతో జరిగిన కథంతా వివరించింది! కథంతా విన్నాక ఆయనకు కూడా కంట్లో నీళ్ళు తిరిగాయి.

"కోడిపుంజూ! నువ్వు చెప్పేదంతా బాగానే వుంది. కానీ మన ప్రభుత్వ విధానంలో వున్న ఒక లక్షణం నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేదు. నువ్వు ఉత్పత్తి సాధిస్తానంటే ప్రభుత్వం వద్దనదు! కాని ఫలితం నువ్వొక్కడివే అనుభవిస్తానంటే ఒప్పుకోదు! ఇంతకీ ఈ భూమికి పన్ను కట్టేవా?" అన్నాడు అసలు పాయింటుకు వస్తూ.

"బంజరు భూమిని కష్టపడి సాగులోకి తెచ్చాను! బీడుపడి పోయి ఉంటే బాగు చేశాను. నేను పన్ను ఎందుకు కట్టాలి?" అంది.

"అదే తమాషా. పన్ను కట్టితీరాలి నువ్వు." అంటూ ఎనిమిది బస్తాల్లోనూ రెండు బస్తాలు పన్నుక్రింద తీసుకుపోయాడు.

అంతలోనే ఎరువుల్ని సప్లయి చేసిన పెద్దమనిషి వచ్చాడు. తన అప్పు జమకింద మూడు బస్తాల ధాన్యం ఇమ్మన్నాడు.

"నువ్వు నాకు చేసిన ఎరువుల సహాయానికి ఒక బస్తా తీసుకువెళ్లు." అంది కోడిపుంజు.

"అసలు అంతే. మరి వడ్డీ సంగతో. వడ్డీ రెండు బస్తాలు. మొత్తం మూడు బస్తాలు!" అంటూ మరి మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా మూడు బస్తాల ధాన్యం తీసుకుపోయాడు.

కోడిపుంజు దిగులుతో మిగిలిన మూడు బస్తాలవంకా చూస్తూ నిలబడిపోయింది.

అంతలోనే ప్రొక్యూర్మెంటు ఆఫీసరు వచ్చి "రెండుబస్తాలు లారీలో వెయ్యండి" అంటూ లోడ్ చేయించి "త్వరలోనే ప్రభుత్వంవారు నీకు డబ్బు ఇస్తారు. కోడిపుంజుగారూ శెలవు" అంటూ శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. మిగిలిన ఒక్కబస్తావంకా చూస్తూ వుంటే కన్నీళ్ళొచ్చాయి కోడిపుంజుకు. అంతలోనే మరో పెద్దమనిషి వచ్చి చెప్పాపెయ్యకుండా ఆ ఒక్క బస్తాను జీపులో వేయించుకొని తీసుకు వెళ్ళిపోయాడు. ఈ హఠాత్సంఘటనకు మతిపోయినట్లయింది. అయిదు నిమిషాల తర్వాత తేరుకుని వెనక నిలబడ్డ మిత్రుల్ని అడిగింది. "ఆయనెవరు?" అని.

"ఆయన ఆదాయపు పన్ను అధికారి. నీ ఆదాయానికి పన్ను కింద ఆ బస్తా పట్టుకుపోయాడు. నువ్వు ఆయనతో ఏదయినా మాట్లాడాలనుకుంటే కోర్టుద్వారా మాట్లాడాలి. అంతే." అంటూ అసలు సంగతి వివరించి చెప్పారు. తర్వాత అట్టలు కిందపడేసి ఎవరిదారిన వాళ్ళు పోయారు!

కోడిపుంజుకు ఆ రాత్రి అంతా నిద్రపట్టలేదు.

మరుసటి ఉదయం పెంటకుప్పమీద తిండికోసం కెలుకుతూ వుంటే మళ్ళీ బోలెడు ధాన్యం గింజలు కనబడ్డాయి కోడిపుంజుకు. ఈసారి, వేరే ఆలోచన లేకుండా వాటిని సుభ్రంగా ముక్కుతో పొడుచుకుని తినేసింది కోడిపుంజు.


With Best Compliments From :

SREE LAKSHMI ENTERPRISES
BLOCK MAKERS
MUSEUM ROAD, VIJAYAWADA-520 002
PHONE : 7 7 8 6 9

SREE LAKSHMI ENTERPRISES
BLOCK MAKERS
31-32-74 DABAGARDENS OPP. MANORAMA LODGE
VIASAKHA PATNAM - 20